క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఎంపీపీ



వైవీ సుబ్బారెడ్డితో ఎంపీపీ గాయం సావిత్రి, బలరామిరెడ్డి, ఈశ్వరమ్మ

హనుమంతునిపాడు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఎంపీపీ గాయం సావిత్రి, పార్టీ సీనియర్ నాయకులు గాయం బలరామిరెడ్డి, ఈశ్వరమ్మలు మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధి పనులకు ఎంపీ గ్రాంట్ కింద నిధులు సమకూరుస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సింగరాయకొండ: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈ నెల 16న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి గ్రామసభలు నిర్వహించిందని, ఆ వివరాలను ప్రజావేదికలో చర్చిస్తామని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్

కనిగిరిరూరల్: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషన్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు సచివాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తక్షణ స్పందించాలన్నారు. పారిశుధ్య వినతులు, సమస్యలు, ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. తొలుత పట్టణంలో పర్యటించి పారిశుధ్య చర్యలు, తక్షణం పూడికతీత, చెత్త తొలగింపు, చెట్ల తొలగింపు తదితర కార్యక్రమాలను చేయించారు. పరిశుభ్రతపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఈ కోటేశ్వరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యం అవసరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

సీఎస్‌పురం(పామూరు): యువత అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలని జెడ్పీహెచ్ హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. స్థానిక పాఠశాలలో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమంలో భాగంగా ఒకేషనల్ ట్రైనర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నైపుణ్యత భవిష్యత్‌లో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. విద్యార్థులతో సైన్స్, మేథ్స్ మొదలైన వాటికి సంబంధించి పరిశోధనాత్మకమైన అంశాలపై చిత్రపటాలు వేయించారు. అనంతరం వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఒకేషనల్ ట్రైనర్స్ రాధాకృష్ణ, రవి, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కరేడుకు బుర్రా, పర్వతరెడ్డి

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గ్రామంలో బుధవారం కందుకూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరేడు రైతుల ఉద్యమానికి అండగా ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవడానికి వస్తున్నట్లు గ్రామ పార్టీ తెలిపింది. ఉదయం 9 గంటలకు కరేడు ర్యాంపు వద్ద ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతారు. ఉదయం 9.30 గంటలకు రామకృష్ణాపురం కాలనీ వాసులతో మాట్లాడుతారు. 10 గంటలకు ఉప్పరపాలెం గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటారు. 10.30 కరేడు వైఎస్సార్ విగ్రహం వద్ద పత్రికా సమావేశం నిర్వహిస్తారు. తదుపరి బుర్రా 11గంటలకు ఉలవపాడులో బాబు ష్యూరిటీ మోసం-గ్యారంటీ, రీ కాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పూర్తి చేసేదెప్పుడు.. ప్రారంభించేదెప్పుడు..?

- గ్రామాల్లో నిలిచిన సచివాలయాల నిర్మాణాలు
- పూర్తయిన వాటిని ప్రారంభించని కూటమి ప్రభుత్వం
- సిబ్బందిపై కొరవడిన పర్యవేక్షణ
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా భవనాలు



ప్రారంభానికి నోచుకోని టంగుటూరు-1వ సచివాలయం



మర్లపాడులో నిలిచిన సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం నిర్మాణాలు

టంగుటూరు:

ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే తీసుకువచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేశారు. గ్రామ స్వరాజ్యం సాధన దిశగా తొలి అడుగు వేసి గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ఆ ఐదేళ్లలో కొన్ని పూర్తయి ప్రారంభించగా..మరికొన్ని పూర్తయి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. గతంలో శిథిలావస్థకు పంచాయతీ భవనాలే దిక్కు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలతో ఆధునాతన భవనాలు ప్రతి పంచాయతీలో వెలిశాయి. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా ఇంటి పక్కనే ఉన్న సచివాలయాల్లో అన్నీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఇదంతా గతం. ఏడాదిలోనే అంతా తిరగబడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ భవన నిర్మాణాలు పూర్తిగా నిలిపివేసింది. పూర్తయి ప్రారంభానికి నోచుకోని వాటిని గాలికొదిలేసింది. దీంతో ఎక్కడకక్కడ భవన నిర్మాణాలు మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. కొన్ని పంచాయతీల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

ఎక్కడికక్కడ నిలిచిపోయాయ్..

టంగుటూరు మండలంలో 18 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా కందులూరు, అనంతవరం, పొందూరు, వల్లూరులో ప్రజలకు సేవలు అందుతున్నాయి, టంగుటూరు 1,2,3, జమ్ములపాలెం, మర్లపాడు, సూరారెడ్డిపాలెం గ్రామాల్లో సచివాలయాలు పూర్తయినా ప్రారంభించలేదు. ప్రస్తుతం ఆ భవనాలు మందుబాబు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అలాగే ఆలకూరపాడు, టంగుటూరు - 4, కాకుటూరివారిపాలెం, మల్లవరప్పాడు, తూర్పునాయుడుపాలెం, కొణిజేడు, కారుమంచి, ఎం. నిడమానూరు గ్రామాల సచివాలయాలు టీడీపీ నాయకులు కోర్టులో వేయటం, స్థల వివవాదాల కారణంగా ఆగిపోయాయి.

- మండలంలో 18 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా అనంతవరం, టంగుటూరు- 1, పొందూరు, కందులూరు, వల్లూరు వినియోగంలో ఉన్నాయి. జమ్ములపాలెం, టంగుటూరు 2,3 సచివాలయాలు ప్రారంభించినా ఆఅ శాఖల అధికారులు ఉపయోగించడం లేదు, మిగిలిన 10 రైతు భరోసా కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి.
- మండలానికి 17 హెల్త్ క్లినిక్లు మంజూరు కాగా సూరారెడ్డిపాలెం, పొందూరు, అనంతవరం గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కొణిజేడు, వల్లూరు, ఎం. నిడమానూరు, కాకుటూరివారిపాలెం, టంగుటూరు -2 పాత భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన తొమ్మిది నిర్మాణ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటి నిర్మాణాలు నిలిచిపోయాయి.

ప్రజల సేవలకు దూరంగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెలోనే సేవలు అందజేసేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి సేవలు ప్రజలకు నేరుగా అందాయి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ తదితర సేవలు వివిధ ధ్రువీకరణపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు సచివాలయాల్లో పొందేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి ఒక్కసారిగా తిరగబడింది. సచివాలయాల్లో సేవలు అంతంతమాత్రంగా అందుతుండటంతో ప్రజలు మళ్లీ మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

చొరవ చూపని ప్రభుత్వం..

గత ప్రభుత్వంలో ఆయా భవన నిర్మాణాలు శరవేగంగా సాగాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వీటి నిర్మాణాలు పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



జమ్ములపాలెం సచివాలయ ఆవరణంలో మందు సీసాలు

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు



కూటమి ప్రభుత్వం సచివాలయాలను నిర్వీర్యం చేసేలా వాటి గురించి పట్టించుకోవడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలను అలా వదిలేయడం దుర్మార్గమైన చర్య. ఆ భవనాలను పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

– చింతపల్లి హరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు



ప్రజలు వివిధ పనులపై సచివాలయాలకు పోతుంటే సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. గతంలో ఆ పరిస్థితి లేదు. సచివాలయంలో సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఎవరు అందుబాటులో ఉంటారో అర్థం కావడం లేదు.

– ఏలూరి వంశీకృష్ణ, పొందూరు

రేపు నారాయణస్వామి ఆరాధన మహోత్సవం



శ్రీనారాయణస్వామి మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, ఉదయం 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మహానారాయణహోమం, నవగ్రహ హోమాలు ఉంటాయన్నారు. 11.30 గంటలకు గోపూజ, 12 గంటలకు మహానైవేద్యం, రాత్రి 7 గంటలకు స్వామి పల్లకీసేవ, పంచహారతులు, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బాలల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: బాలల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అందరూ సమష్టి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ బాలల అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన, ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలలను అక్రమ రవాణా చేయడం, కొనడం, అమ్మడం, బలవంతంగా ప్రలోభపెట్టి తరలించడం నేరమన్నారు. సీడీపీఓ సరోజనీ మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకట్ట వేయడం వల్ల బాలల అక్రమ రవాణాను నిరోధించవచ్చన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు మండ్రు రమేష్‌బాబు, సూపర్‌వైజర్ సుమతి, నవకుమార్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కొండపి: మండలంలోని మిట్టపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న అవ్వారి పిచ్చమ్మ, ముప్పరాజు వీరయ్యను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు జి.సురేష్‌బాబు అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే కాకుండా పాఠశాలలో అభివృద్ధిలో కూడా వారి శ్రమ ఉందని కొనియాడారు. అనంతరం గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ రమేష్‌బాబు, వైస్ చైర్మన్ తిరుపతమ్మ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం



కమిటీ పత్రాలు, రీకాల్ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న హుసేన్‌రెడ్డి

పామూరు: పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఎంతో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బుక్కాపురం గ్రామ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను మండలపార్టీ అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, సర్పంచ్ యం.గోవర్ధన రాధాకృష్ణలు నియమించారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా పి.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కె.గంగయ్య, వై.శ్రీరాములు, కార్యదర్శులుగా సీహెచ్.ఆంజనేయులు, పందిటి గురవయ్యలను నియమించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ప్రతి ఇంటా వివరించి కూటమి ప్రభుత్వ మోసాలపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముడియాల అనంతరెడ్డి, బి.చెంగళరావు, బి.కొండయ్య, జి.శ్రీనివాసులు, చింతం సుధాకర్, కుర్రా నాగరాజు, పంగా తేజ, పి.కల్యాణ్, యం.శ్రీహరి, కాకు త్రినాథ్, బి.మురళి, పి.నరసింహులు, యం.అంకబాబు, శ్రీనివాసులు, పృథ్వి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో కుంటుపడిన విద్యావ్యవస్థ



సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల కొరతతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందని, తక్షణం ప్రభుత్వం విద్యావలంటీర్లను నియమించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్.పాదుషా అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారని తక్షణం వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవాలన్నారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతుందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను సాచివేత ధోరణితో కాకుండా తక్షణం చెల్లించాలన్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు జవంగుళ వెంకటరావు, జి.లక్ష్మీనారాయణ, మానం శ్రీనివాసులు, బీవీ రమేష్, వైవీ సుబ్బారావు, కుండా వెంకటేశ్వర్లు, పలువురు యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం



పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సీఎస్‌పురం(పామూరు): స్థానిక కెనరాబ్యాంక్ సమీపంలోని పీర్లచావిడి పీర్ల గ్రామోత్సవం మంగళవారం హిందూ, ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పీర్లకు పూజలు చేశారు. అనంతరం సాయంత్రం మేళతాళాల నడుమ పీర్లు ఉత్సవంగా జలధిస్నానానికి తరలాయి.

కార్యక్రమంలో ముజావర్‌లు, ముస్లిం, హిందువులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ కోటేశ్వరమ్మ

టంగుటూరు: × పని లేక కాదు సర్వసభ్య సమావేశాలు నిర్వహించేది. ఇప్పటి వరకు ఒక్క సమావేశానికి అధికారులు సక్రమంగా హాజరు కాలేదని ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ ఆధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి అధికారులు హాజరుకాకుంటే ప్రజాప్రతినిధులు సమస్యలు ఎవరికి చెప్పాలన్నారు. సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, గ్రామాల్లో డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వచ్చిన ఇద్దరు అధికారులు వారి శాఖల నివేదికను వివరించారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 4 గంటలకు ప్రారంభించి ఒక గంటకే మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవసేన కుమారి, జెడ్పీటీసీ అరుణకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పడిపోతున్న పొగాకు సరాసరి ధరలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: అసలే ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే సరాసరి ధరలు దిగజారుతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసర ధర రూ. 209. 16కి పడిపోయింది. వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 1018 బేళ్లనుతీసుకురాగా 784 బేళ్లను కొనుగోలు చేసి 234 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధరరూ.160, సరాసరి ధర రూ.209.16గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ కార్మికులకు జీఓ నం.36 ప్రకారం జీతాలు ఇవ్వాలని, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చార్లస్, లక్ష్మయ్య, ప్రసాద్, నరేంద్ర, మనోహర్, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ఎంఈఓలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని సి.నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్‌పాఠశాలలో మంగళవారం పాఠశాల హెచ్‌ఎం బుడాల డేవిడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత శ్రీనివాసవర్మ అందజేసిన విద్యా సామగ్రిని ఎంఈఓలు జె.ప్రసాదారావు, రాజాల కొండారెడ్డి అందజేశారు. అదేవిధంగా సి.నాగులవరం, చింతపూడు, కోమటిగుంట్ల ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు 390 మందికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో హస్తి వీరాంజనేయులు, ముప్పాళ్ల వసంతకుమార్, కిరణ్, కృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫ్రిజ్ అందజేత



పాఠశాలకు వాటర్‌ఫ్రిజ్ అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

పామూరు: మండలంలోని మోపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు గ్రామానికి చెందిన దాత మునగల రాములమ్మ, కుమారుడు మునగల వెంకటేశ్వరరెడ్డి వాటర్ ఫ్రిజ్ అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు వాటర్‌ఫ్రిజ్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు తవ్వా మాల్యాద్రిరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, కె.ప్రసాదు, ఎస్వీ లక్ష్మి, ఇస్రాయేలు, రజియా, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.